క్లుప్తంగా

ఖాద్రీశుడికి ప్రత్యేక పూజలు


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కదిరి టౌన్: స్థానిక ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారం కావడంతో ఆలయం భక్త జనంతో కిటకిటలాడింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఖాద్రీశుడిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయం ముందు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతోపాటు అన్నదానం నిర్వహించారు.

22 నుంచి పోతుకుంటలో పీపీఎల్ క్రికెట్ టోర్నీ

ధర్మవరం రూరల్: ఈ నెల 22 నుంచి పోతుకుంట పోలీస్ గెస్ట్ హౌస్ వెనుక ఉన్న మైదానంలో పోతుకుంట ప్రీమియర్ లీగ్ (పీపీఎల్) క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. విన్నర్స్‌కు రూ.25వేలు, రన్నర్స్‌కు రూ.15 వేలు నగదు బహుమంతి అందిస్తామన్నారు. ఈ నెల 20లోపు జట్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9948277373, 9052596812 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీద్దాం


విద్యార్థులతో కథలు చదివిస్తున్న ఉపాధ్యాయుడు శంకరయ్య

బత్తలపల్లి: విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు వారిలో సృజనాత్మకతను వెలికితీసేందుకు గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం దోహదం చేస్తుందని గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన శిబిరంలో ఆమె మాట్లాడారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయుడు శంకరయ్య విద్యార్థులకు పద్యాలు, కథలు, చెస్, చిత్రలేఖనం, ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు.

శ్రీఖాద్రీ ఆలయంలో షాపు రూమ్‌లు బహిరంగ వేలం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన చౌక్ బజార్‌లో ఉన్న 4 షాపు రూంలు మూడేళ్ల హక్కు కోసం ఈనెల 24న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కింద ఉన్న 1,2 రూంలకు రూ.2,50,000, పైన ఉన్న 3,4 రూంలకు రూ.50000 ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వివరాలకు 9000490670 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలి


రాజకీయ నాయకులకు సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

చెన్నేకొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత గ్రామాల్లో గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు నాయకులకు సూచించారు. శనివారం చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లోని సర్కిల్ కార్యాలయంలో నామాల గ్రామానికి చెందిన ఇరు పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఇరు పార్టీల నాయకులకు పలు సూచనలిచ్చారు. గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. పోలీసుల హెచ్చరికలను పెడచెవిన పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గొడవల్లో జోక్యం చేసుకోరాదన్నారు. అనంతరం పలువురు గ్రామస్తులను బైండోవర్ చేశారు. కార్యక్రమంలో రామగిరి సీఐ శివాంజనేయులు, చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేష్‌బాబు

పుట్టపర్తి: గ్రామాలలో ఎన్నికల అనంతరం శాంతిభద్రతలకు విఘాత కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బుక్కపట్నం ఎస్‌ఐ సురేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం బుక్కపట్నం మండలం అగ్రహారంలో సిబ్బందితో కలిసి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఒకరిపై ఒకరు ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడొద్దని సూచించారు.

ఘనంగా వాసవీమాత జయంతి వేడుకలు


ధర్మవరంలో పూజలు అందుకున్న వాసవీమాత


కదిరిలో పూజలు అందుకున్న వాసవీమాత


పుట్టపర్తిలో ముత్యాల అలంకారంలో అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత

ధర్మవరం రూరల్: పట్టణంలో శనివారం వాసవి కన్యకా పరమేశ్వరదేవి ఆలయంలో వాసవీమాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం దేవస్థానం కమిటీ, వాసవీ మహిళా మండలి, ఇతర అనుబంధ కమిటీల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు నారాయణమూర్తి, చంద్రశేఖర్ శర్మ, జయసింహ, విశ్వనాథ్, పవన్‌కుమార్, సురేంద్ర అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం 500 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన గావించారు. వాసవీ మండలి ఆధ్వర్యంలో పాటల ఆలాపన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

తలుపుల: మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో శనివారం ఆర్యవైశ్యులు అమ్మవారి జయంతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం అమ్మవారికి గంగపూజ, పంచామృతాభిషేకం చేశారు. పుష్పయాగం కోసం బాజా భజంత్రీలతో వివిధ రకాల పూలను బుట్టల్లో ఆర్యవైశ్య మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు ఆర్యవైశ్యసంఘం, వాసవీ మహిళా మండలి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీరాములు శెట్టి, ఉపాధ్యక్షులు రవీంద్రశెట్టి, ట్రెజరర్ రామక్రిష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కదిరిలో..

కదిరి టౌన్: పట్టణంలోని వాసవీమాత ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మవారిని రకరకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగిచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యం సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత జయంతి సందర్భంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు అమ్మవారికి 108 రకాల హారతులు సమర్పించారు. వాసవీమాత ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులుకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్యులు వాసవీమాత జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు శంకర శాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారిని ముత్యాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్యవైశ్య మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో భజన చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో ఆలయం కిటకిటలాడింది.

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో వాసవీమాత జయంతిని ఆర్యవైశ్యులు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆర్యవైశ్య సత్రంలో వాసవీమాత విగ్రహానికి అభిషేకం చేసి, ప్రత్యేంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పట్టణంలోని పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు.


చెన్నేకొత్తపల్లి: వాసవీమాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


పుట్టపర్తిలో కుంకుమార్చన చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు


తలుపులలో పూల బుట్టలు తీసుకొస్తున్న ఆర్యవైశ్యులు

హంస వాహనంపై సంగమేశ్వరుడు


హంస వాహనంపై ఊరేగుతున్న సంగమేశ్వరుడు

కొత్తచెరువు: మండల కేంద్రంలో సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు శనివారం సంగమేశ్వరస్వామి హంస వాహనంపై ఊరేగారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కేసీ మనోహర్, సభ్యులు నాగేంద్రప్రసాద్, పణీంద్ర, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాహన రికార్డులు తప్పనిసరి

ధర్మవరం రూరల్: వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులను తప్పనసరిగా ఉంచుకోవాలని ఎంవీఐ అధికారి వరప్రసాద్ సూచించారు. శనివారం పట్టణంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు సక్రమంగా లేని నాలుగు ఆటో యజమానులపై కేసు నమోదు చేశారు. వాహనదారులు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు రికార్డులు కలిగి ఉండాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

తాడిమర్రి: పెద్దకోట్ల గ్రామంలో శుక్రవారం రాత్రి బత్తిన నారాయణస్వామి అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన వారు కులం పేరుతో దూషించడంపై పోలీసుల కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ నాగస్వామి తెలిపిన వివరాలు.. బత్తిన నారాయణస్వామి, శివయ్యకు పాత కక్షలుండేవి. శుక్రవారం రాత్రి నారాయణస్వామి వీధిలో వెళుతుండగా శివయ్య, అశోక్, చౌడప్ప, రాజబాబు, బాబు కులం పేరుతో దూషించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

త్వరలో విత్తన వేరుశనగ పంపిణీ


తనకల్లు ఆర్‌బీకేలో విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న ఏఓ శ్రీహరినాయక్

తనకల్లు: త్వరలో సబ్సిడీ విత్తన వేరుశనగను పంపిణీ చేయనున్నట్లు ఏఓ శ్రీహరినాయక్ తెలిపారు. స్థానిక ఆర్బీకేలో నిల్వ ఉంచిన విత్తన వేరుశనగ నాణ్యతను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 ఆర్బీకేల్లో విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించామన్నారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, మొబైల్ ఫోన్‌తో ఆర్‌బీకేల్లో సంప్రదించాలని సూచించారు. మండలంలో 301 క్వింటాళ్ల వేరుశనగను ఆర్‌బీకేలలో నిల్వ ఉంచినట్లు తెలియజేశారు. వీహెచ్ మహేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

తాడిమర్రి: వేరుశనగ రాయితీ విత్తనం కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారిణి రమాదేవి తెలిపారు. వేరుశనగ విత్తనం క్వింటా పూర్తి ధర రూ.9500 కాగా 40 శాతం రాయితీ ధర రూ.3,800 పోగా మిగిలిన రూ.5,700గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రతి రైతుకు 3 బస్తాలు(ఒక బస్తాకు 30 కేజీలు) చొప్పున పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు.

కనగానపల్లి: ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల కోసం స్థానిక ఆర్‌బీకేల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏడీఏ కిష్టయ్య శనివారం ఓ ప్రకటనలో రైతులకు సూచించారు. ఆర్బీకే సిబ్బంది కూడా కార్యాలయంలో రైతులకు అందుబాటులో ఉండి రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలన్నారు.

అమడగూరు: మండలంలోని 6 రైతుభరోసా కేంద్రాలకు విత్తన వేరుశనగ కాయలు సరఫరా అయినట్లు వ్యవసాయాధికారి వెంకటరమణాచారి తెలిపారు. శనివారం చినగానిపల్లి, అమడగూరు, కస్సముద్రం, గుండువారిపల్లి, మహమ్మదాబాద్, జౌకలకొత్తపల్లి ఆర్బీకే గోదాములలో విత్తన కాయలను నిల్వ చేశామన్నారు. ఉన్నతాధికారులు నిర్ణయించిన మేరకు 40 శాతం సబ్సిడీ ధర పోగా రైతువాటాగా 30 కేజీల బస్తా ధర రూ 1,710 ప్రతి పాస్ పుస్తకానికి 3 బస్తాల కాయలను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. యాప్‌ను రూపొందించగానే ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు.

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన


అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి


ఆలయంలో పూజలు చేస్తున్న ఆశ్రమ పీఠాధిపతి

కదిరి టౌన్: పట్టణంలోని కోనేరు వద్ద ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామి ఆరాధన శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారి పతకావిష్కరణ, గణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, మండలార్చనలు, స్వామికి సహస్రనామావళి, ద్వాదశాక్షరీ నామహోమం, గణపతి, నవగ్రహ హోమాలు చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

కనగానపల్లి: మండలంలోని పాతపాళ్యం గ్రామంలో శనివారం పోతులూరి వీరబ్రహేంద్రస్వామి ఆరాధనను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మంగారి ఆలయ ఆశ్రమంలో భక్తులు తెల్లవారుజామున నుంచి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ఆశ్రమ పీఠాధిపతి రామయ్యస్వామి బ్రహ్మంగారి కాలజ్ఞానం, జీవ సమాధి గురించి ప్రజలకు తెలియజేశారు. ఇక సాయంత్రం గ్రామంలో బ్రహ్మంగారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గోవిందురెడ్డి, మనోహర. సన్నప్పయ్య, శీనప్ప, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో భారీ వర్షం


సత్యమ్మ ఆలయం చుట్టూ చేరిన వర్షపునీరు


వర్షంలోనే వెళ్తున్న ద్విచక్రవాహనదారులు

పుట్టపర్తి రూరల్: మలమల మాడ్చిన గ్రీష్మతాపాన్ని జోరువాన ఒక్కసారిగా చల్లార్చింది. పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం గంటన్నరపాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో హనుమాన్ సర్కిల్ నుంచి ప్రశాంతి నిలయం, గోపురం వరకూ రోడ్లు జలమయమయ్యాయి. సత్యమ్మ ఆలయం కాసేపు జలదిగ్బంధలో చిక్కుకుంది. పాదచారులు, వాహనచోదకులు సైతం రోడ్లు దాటలేని పరిస్థితి నెలకొంది. పుట్టపర్తిలో శనివారం సంత కావడంలో కాయకూరలు, ఆకుకూరలు, పండ్లు, నిత్యాసర వస్తువులు విక్రయదారులు తడిసి ముద్దయ్యారు. కొనుగోలుదారులు, పాదచారులు, ద్విచక్రవాహనదారులు కొందరు గొడుగులు, రోయిన్‌కోట్లు ధరించగా మరికొందరు తొలకరి వర్షంలో తడుస్తూ ఎంజాయ్ చేశారు. ఈ ప్రాంతంలో ఈ ఏడాది ఇదే పెద్ద వర్షంగా నమోదైంది. రైతులు ఆశలు తీరేలా ముంగారు సేద్యాలకు అనువుగా పదును వర్షం కురిసిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నల్లచెరువులో భారీ వర్షం

నల్లచెరువు: మండల కేంద్రంలో శనివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షపు నీరు పలు కాలనీల్లో రోడ్లపై నిండుగా పారింది. జాతీయ రహదారిపై వర్షపునీరు నిల్వ ఉండడంతో ద్విచక్రవాహన దారులు ఇబ్బందులు పడ్డారు.


నల్లచెరువులో వర్షం కురుస్తున్న దృశ్యం

ఘనంగా గంగాభవానీ మాత ఊరేగింపు


అలంకరణలో అమ్మవారి ఉత్సవ విగ్రహం

గాండ్లపెంట: స్థానిక గంగాభవానీ మాత తిరునాల్లో భాగంగా రెండవరోజు శనివారం అమ్మవారి ఉత్సవ విగ్రహన్ని భక్తులు ఘనంగా ఊరేగించారు. తొలుత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ విద్యుత్ దీపాలతో అలంకరించిన వాహనంలో అమ్మవారిని ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి టెంకాయల సమర్పించి మొక్కులు చెలించుకున్నారు. కీలుగుర్రాలు, చక్కభజన, కొలాటాలతో ఊరేగింపు ముందుకు సాగింది. రాత్రి భక్తి పాటల కచేరి ఏర్పాటు చేశారు.

అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

కదిరి అర్బన్: అరుణాచలం గిరిప్రదక్షిణకు కదిరి డిపో నుంచి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డీఎం మైనోద్దీన్ శనివారం తెలిపారు. ఈ నెల 23న పౌర్ణమిని పురస్కరించుకుని కదిరి డిపో నుంచి 22వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక సర్వీసు అందుబాటులో ఉంటుందన్నారు. సరీ్వసు ద్వారా కాణిపాకం, కంచి, స్వర్ణదేవాలయాలను సందర్శించవచ్చన్నారు. ఎక్స్‌ప్రెస్‌లో పెద్దలకు రూ. 1050, సూపర్ లగ్జరీలో రూ.13,00 వసూలు చేస్తామన్నారు. ఫోన్‌పే 9052537054 ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని సూచించారు.

సజావుగా మండల మీట్

అమడగూరు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కవితా శివశంకర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి

పుట్టపర్తి రూరల్: ఎనుములపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు శనివారం మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో గ్రామంలోని కొన్ని ప్రాంతాలకు నీరు సరఫరా కావడం లేదన్నారు. నెల రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని, వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం.. మామిడి రైతులకు శాపం


ఎండిపోయిన మామిడి మొక్క

నల్లమాడ: పండ్లమొక్కల పెంపకానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తోంది. పండ్లతోటలు సాగుచేసే రైతులకు ఎన్నో రాయితీలుగా కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది. అయితే కొందరు అధికారుల నిర్లక్ష్యం పండ్లతోటల రైతులకు శాపంగా మారింది. వివరాల్లోకెళ్తే..మండలంలోని పెమనకుంటపల్లి తండాకు చెందిన రైతులు శంకర్‌నాయక్, అంజినాయక్ తమకున్న ఒకటిన్నర ఎకరాల పొలంలో గతేడాది బోరు బావి తవ్వించి ఉపాధి హామీ పథకం కింద 11 నెలల క్రితం 120 మామిడి మొక్కలు నాటారు. విద్యుత్ సౌకర్యం కోసం ఈ యేడాది జనవరిలో రూ.24 వేలు డిపాజిట్ రూపంలో ట్రాన్స్‌కోకు చెల్లించినట్లు రైతులు తెలిపారు. మూడు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసిన అధికారులు విద్యుత్ వైరు, ఇతర పరికరాలు ఇంతవరకు ఇవ్వలేదని వారు వాపోయారు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేకుందని నిట్టూర్చారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తచెరువు: ఆన్‌లైన్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా బాలల పరిరక్షణా సమితి అధికారి నాగలక్ష్మి తెలిపారు. శనివారం కొడపగానిపల్లి, దేవరపల్లిలో ప్రభాత్‌రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ, బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు మొబైల్ ఫోన్లలో బాలలపై జరిగే మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా జిల్లాధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ మొదటగా తల్లిదండ్రులు మెబైల్‌ఫోన్లో జరిగే ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్‌లు, అశ్లీల వెబ్‌సైట్‌లపై అవగాహన పెంచుకోవాలన్నారు. పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచడం మంచిదన్నారు. ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా పౌండేషన్ జిల్లా ప్రతినిధి కొండప్ప, సోషల్ వర్కర్లు వనజాక్షి, భారతి, శ్రీధర్ పాల్గొన్నారు.